నేడు మధిరలో గ్రీవెన్స్ డే: కలెక్టర్

మామిళ్లగూడెం/ మధిర, ఫిబ్రవరి 11: ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని ఈ సోమవారం మధిర పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ మార్పును గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వదంతులను నమ్మొద్దు

- చిన్నపిల్లల కిడ్నాప్, ముఠా అరెస్టు వంటి కథనాలన్నీ కల్పితాలే..
- సామాజిక మాధ్యమాల్లో తప్పడు పోస్టులు పెడితే చర్యలు: సీఐ

సీఐ ఉదయ్‌కుమార్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 11: పోలీసుల అదుపులో చిన్న పిల్లల కిడ్నాప్ ముఠా ఉన్నదంటూ వస్తున్న వదంతులను నమ్మవద్దని ఖమ్మం వన్ టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని ముఠాలు చిన్న పిల్లలను కిడ్నాప్ చేస్తున్నాయని, ఆ ముఠాలను పోలీసులు అరెస్టు చేశారని కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారని అన్నారు. అసత్య ప్రచారాలను పోస్ట్ చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఎవరైనా ఇలాంటి పోస్టులను వైరల్ చేస్తూ అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. నగరంలో కిడ్నాప్ అనే కథనం కేవలం అభూతన కల్పన మాత్రమేనని అన్నారు. కిడ్నాప్ గానీ, కిడ్నాప్ యత్నం గానీ జరగలేదని స్పష్టం చేశారు. కిడ్నాప్ అంటూ వైరల్ సోషల్ మీడియా పోస్టుపై సైబర్ క్రైమ్ పోలీసులు ఇప్పటికే విచారణ చేపట్టారని అన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఖమ్మం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే విధిగా విచారిస్తామ అన్నారు. అయితే, అందులో భాగంగా నగరంలో అనుమానాస్పద వ్యక్తిని పోలీసులు విచారిస్తున్న ఒక ఫొటోను కొందరు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

జీవన విధానంలో మార్పులే..

క్యాన్సర్‌కు అసలైన కారణం

ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యనిపుణుడు డాక్టర్ రవిశంకర్

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవిశంకర్

సత్తుపల్లి, ఫిబ్రవరి 11: మానవుడి జీవన విధానంలో వస్తున్న అనేక మార్పులే క్యాన్సర్‌కు కారణమని హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్య నిపుణుడు డాక్టర్ రవిశంకర్ అన్నారు. స్థానిక జేవీఆర్ డిగ్రీ కళాశాలలో లయన్స్‌క్లబ్, చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన క్యాన్సర్ వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా మూడు కారణాలు క్యాన్సర్‌కు దారితీస్తాయని, మానసిక ఒత్తిడి, తినే ఆహారంలో కాలుష్యం, గుట్కా పాన్ మసాలాలు ఇందులో ప్రధానమైనవని వివరించారు. రెండు రోజులుగా జరిగిన వైద్య శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ముగ్గురిలో క్యాన్సర్ ప్రాథమిక లక్షణాలు ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. చేతన ఫౌండేషన్ నిర్వాహకులు పసుమర్తి రంగారావు మాట్లాడుతూ.. ప్రాథమిక దశలో ఉన్న వారు సత్వర చికిత్స తీసుకున్నట్లయితే వ్యాధి నుంచి బయటపడవచ్చని అన్నారు. లయన్స్ క్లబ్ బాధ్యులు దొడ్డా కృష్ణయ్య, పెనుగొండ రమేశ్, గుండు శ్రీనివాసరావు, కొత్తూరు ప్రభాకర్‌రావు, గండ్ర సోమిరెడ్డి, మందపాటి ప్రభాకర్‌రెడ్డి, జంగా సత్యనారాయణ, రమ, జయ, హరిబాబు, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నల్గొండ సభను జయప్రదం చేయండి: బీఆర్ఎస్

చింతకానిలో బీఆర్ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, వైరాలో చలో నల్గొండ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

చింతకాని, ఫిబ్రవరి 11: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో ఈ నెల 13న నల్గొండలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య పిలుపునిచ్చారు. మండలంలోని వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు ఇంటి వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు. వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు, నాయకులు వంకాయలపాటి వెంకటలచ్చయ్య, పాపినేని రంగారావు, పిన్నెల్లి శ్రీను, పోట్ల సీతయ్య, వెంకటేశ్వర్లు, మాధవరావు, వెంకటనారాయణ పాల్గొన్నారు.

'చలో నల్గొండ' పోస్టర్ల ఆవిష్కరణ

వైరా రూరల్/ పెనుబల్లి, ఫిబ్రవరి11: కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని వ్యతిరేకిస్తూ నిర్వహిస్తున్న చలో నల్గొండ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వైరా మండలంలోని గొల్లెనపాడులో సభ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. ఇదే విషయంపై పెనుబల్లిలో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ మండల కనగాల వెంకట్రావు కూడా మాట్లాడారు. ఈ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

14న విద్యుత్ వినియోగదారుల సదస్సు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 11: మండలంలోని మంచుకొండ గ్రామంలో ఈ నెల 14వ తేదీన విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు టీఎస్ ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ కే తిరుమల్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పునరుద్దరణకు కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మర్చడం, వోల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపు, లోపాలున్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, బిల్లుల సమస్యలు, క్యాటగిరి మార్పు, సర్వీస్ రద్దు వంటి వాటిపై ఈ సదస్సులో ఫిర్యాదులు అందజేయవచ్చునన్నారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'వంద బెడ్ల ఆసుపత్రి తరలింపు ఆలోచన వద్దు'

సమావేశంలో మాట్లాతున్న బొంతు రాంబాబు

వైరా టౌన్, ఫిబ్రవరి 11: వైరా నుంచి వంద బెడ్ల ఆసుపత్రి తరలింపు ఆలోచనను విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో ఆదివారం జరిగిన స్టడీ సర్కిల్లో ఆయన మాట్లాడారు. వైరా నియోజకవర్గ కేంద్రాన్ని విద్య, వైద్య కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాలని కోరారు. వైరాకు ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు కూడా మంజూరు చేయాలని కోరారు. నాయకులు తోట నాగేశ్వరరావు, బొంతు సమత, పారుపల్లి చంద్రశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

16న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

కొణిజర్ల, ఫిబ్రవరి 11: ఈ నెల 16న జరిగే పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ నాయకుడు ఎస్కే ఖాసీం కోరారు. మండలంలోని రామనర్సయ్యనగర్‌లో ఆదివారం ఈ సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సాలెబంజర, రామనర్సయ్యనగర్, అన్నవరం, ఎన్టీఆర్‌నగర్ గ్రామాల్లో కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రచారం నిర్వహించారు.

దెందుకూరులో వైద్యశిబిరం

వైద్య శిబిరంలో వైద్యులు, ప్రజాప్రతినిధులు

మధిర రూరల్, ఫిబ్రవరి 11: మండలంలోని దెందుకూరు ప్రభుత్వ హైస్కూల్లో మధిరకు చెందిన షిఫా చెస్ట్ అండ్ వెటర్నటీ హాస్పిటల్ బాధ్యులు ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ మొహమ్మద్ అమ్జద్‌షరీఫ్ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

నేటి నుంచి రామదాసు అధ్యయనోత్సవాలు

భక్త రామదాసు ధ్యాన మందిరంలో సోమవారం నుంచి వాగ్గేయకారుడు శ్రీరామదాసు అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. 12న సోమవారం నగర సంకీర్తన, శ్రీరామదాసు విగ్రహానికి పాలాభిషేకం, శ్రీరామదాసు నవరత్న కీర్తల గోష్టి గానం, 13 మంగళవారం శ్రీరామదాసు కీర్తన గానం, సుందరాకాండ పారాయణం, వీణా కచేరి, సంగీత నృత్యం, 14న వాయిద్య కళాకారులతో కార్యక్రమం, విష్ణు సహస్రనామ పారాయణం, వీణానాద కచేరి జరుగుతాయని నిర్వాహకులు వివరించారు.

కూసుమంచి (నేలకొండపల్లి), ఫిబ్రవరి 11: నేలకొండపల్లి మండలంలోని

డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే రాగమయి

డిప్యూటీ సీఎంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 11: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, దంత వైద్యురాలు స్రవంతి, ఇతర వైద్యులు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆదివారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం దంత వైద్యులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఇందుకు భట్టి సానుకూలంగా స్పందిస్తూ.. ప్రభుత్వం తరపున త్వరలో నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటన పట్ల హర్షం

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న గిరిజనులు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 11: సేవాలాల్ జయంతి రోజున సెలవు ప్రకటించడం పట్ల సేవాలాల్ సేన బాధ్యుడు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రం రఘునాథపాలెంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

18 మంది ఎంపీడీవోల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 11: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జిల్లాలో మండలస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకూ అధికారుల బదిలీలు జరుగుతున్నాయి. తాజాగా జిల్లాలో వివిధ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవో)లను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ ఉత్తర్వులు అందుకున్న ఎంపీడీవోలు వీరే..

ఎంపీడీవో పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ చేసిన జిల్లా
సీహెచ్ సుభాషిణి	తల్లాడ	మహబూబాబాద్
బయ్యవరపు అశోక్	బోనకల్లు	భద్రాద్రి కొత్తగూడెం
తేల్లూరి శ్రీనివాసరావు	చింతకాని	భద్రాద్రి కొత్తగూడెం
బాణోత్ రవికుమార్	కల్లూరు	మహబూబాబాద్
కుడుముల విజయ్‌భాస్కర్‌రెడ్డి	కామేపల్లి	భద్రాద్రి కొత్తగూడెం
భీమిరెడ్డి రవీంద్రరెడ్డి	ఖమ్మం రూరల్	భద్రాద్రి కొత్తగూడెం
కావూరి నాగలక్ష్మి	కొణిజర్ల	భద్రాద్రి కొత్తగూడెం
రున్వాల రమాదేవి	కూసుమంచి	భద్రాద్రి కొత్తగూడెం
షేక్ సిలార్‌సాహెబ్	మధిర	మహబూబాబాద్
వీడీవీ అశోక్‌కుమార్	ముదిగొండ	భద్రాద్రి కొత్తగూడెం
కుడుముల జమలారెడ్డి	నేలకొండపల్లి	భద్రాద్రి కొత్తగూడెం
ధరావత్ శ్రీనివాసరావు	పెనుబల్లి	భద్రాద్రి కొత్తగూడెం
రాఘవరపు రామకృష్ణ	రఘునాథపాలెం	భద్రాద్రి కొత్తగూడెం
బాణోత్ జయరామ్	సత్తుపల్లి	సిద్దిపేట
మందగొండి చంద్రశేఖర్	సింగరేణి	భద్రాద్రి కొత్తగూడెం
దగ్గుల కరుణాకర్‌రెడ్డి	వైరా	భద్రాద్రి కొత్తగూడెం
బెక్కంటి శ్రీనివాసరావు	ఎర్రుపాలెం	మహబూబాబాద్
బీ.వేణుమాదవ్	ఏన్కూరు	మహబూబాబాద్

జిల్లాలో 13 మంది ఎస్ఐలకు స్థానచలనం

ఉత్తర్వులు జారీ చేసిన జోన్-4 ఇన్‌చార్జి డీఐజీ తరుణ్‌జోషి

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 11: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ జోన్-4 ఇన్‌చార్జి డీఐజీ తరుణ్‌జోషి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎస్ఐల బదిలీలు చేపట్టినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన ఎస్ఐల వివరాలు ఇలా ఉన్నాయి.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పోలోజు కుషకుమార్	ఖానాపురం హవేలీ	ఖమ్మం రూరల్
బీ.గిరిధర్‌రెడ్డి	కొమరారం	తిరుమలాయపాలెం
తోట నాగరాజు	ఖమ్మం-2టౌన్	నేలకొండపల్లి
ఏ.కిరణ్‌కుమార్	సీఎస్‌బీ ఖమ్మం	కూసుమంచి
పీ.సంతోశ్	లక్ష్మీదేవులపల్లి	ఖానాపురం హవేలి
బలగాని సతీశ్	నేలకొండపల్లి	ఖమ్మం-3టౌన్
వీ.సురేశ్	టాస్క్‌ఫోర్స్ ఖమ్మం	ఖమ్మం రూరల్
భాగ్యరాజు వంశీకృష్ణ	టాస్క్‌ఫోర్స్ ఖమ్మం	ఖమ్మం-2టౌన్
వరాల శ్రీనివాస్	తిరుమలాయపాలెం	వీఆర్ ఖమ్మం
సేనాపతి శ్రీకాంత్	కూసుమంచి	వీఆర్ ఖమ్మం
నూకసాని వెంకటకృష్ణ	ఖమ్మం రూరల్	టాస్క్‌ఫోర్స్ ఖమ్మం
ఎండీ యాకుబ్	ఖమ్మం రూరల్	వీఆర్ ఖమ్మం
జీ.డానియల్ ప్రభుదాస్	ఖమ్మం-3టౌన్	వీఆర్ ఖమ్మం

ఖమ్మంలో డాక్టర్స్ క్రికెట్ టోర్నీ

క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించడానికి వచ్చిన వైద్యులు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 11: హైదరాబాద్‌కు చెందిన స్లైజర్ ఫార్మాస్యూటికల్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం పటేల్ స్టేడియంలో నాలుగు జిల్లాల వైద్యుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వైద్యుడు కంభంపాటి నారాయణరావు, కార్యదర్శి డాక్టర్ జగదీశ్, అసాధారణ్, కూరపాటి ప్రదీప్ ప్రారంభించారు. అనంతరం మ్యాచ్‌లో ఖమ్మం నల్గొండ, సూర్యాపేట, వరంగల్ జిల్లాల జట్లు సెమీస్‌కు చేరుకున్నాయి. ఆయా మ్యాచ్‌లను స్లైజర్ సేల్స్ మేనేజర్ సంతోష్, రీజనల్ మేనేజర్ నరేశ్, కంపెనీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

22 నుంచి కేపీఎల్ క్రికెట్ టోర్నీ

టోర్నీ లోగోను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఖమ్మం సిటీ, ఫిబ్రవరి 11: ఖమ్మం పటేల్ స్టేడియంలో ఈ నెల 22 నుంచి మార్చి 1 వరకు ఖమ్మం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఆర్గనైజర్ డాక్టర్ కూరపాటి ప్రదీప్ తెలిపారు. టోర్నీ లోగోను స్టేడియంలో ఆదివారం ఆవిష్కరించారు. ఎండీ మతిన్, బాణాల లక్ష్మన్, నరాల నరేశ్, మోహన్‌నాయుడు, వెంకటప్రసాద్, ఎల్లంకి శ్రీకాంత్, విజయ్‌కుమార్, విరేష్‌గౌడ్, ఫారూఖ్, కొండా యాదవ్, అక్బర్ హమీద్, సాంబమూర్తి పాల్గొన్నారు.

పాఠశాలలకు కంప్యూటర్లు, ప్రింటర్లు



ఎంఆర్‌సీలో నూతన కంప్యూటర్లతో సిబ్బంది

కూసుమంచి, ఫిబ్రవరి 11: పాలేరు నియోజవర్గంలోని నాలుగు మండలాల్లోని 8 ఉన్న పాఠశాలలు, 3 కేజీబీవీలు, 4 ఎంఆర్‌సీలకు 94 కంప్యూటర్లు, 15 ప్రింటర్లను విద్యాశాఖ అందించింది. కూసుమంచి, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలకు 10 కంప్యూటర్లు, ఒక ప్రింటర్, ఎంఈవో కార్యాలయాలకు ఆరు కంప్యూటర్లు, ఒక ప్రింటర్, 8 ఉన్నత పాఠశాలల 5 కంప్యూటర్లు, ఒక్క ప్రింటర్ చొప్పున అందజేశారు

పూర్వ ప్రాథమిక విద్యపై కళాజాత

అవగాహన కల్పిస్తున్న కళాబృంద సభ్యులు

బోనకల్లు, ఫిబ్రవరి 11: అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్యపై ఎఫర్ట్ సంస్థ బాధ్యులు మండలంలోని రాయన్నపేట, చొప్పకట్లపాలెం, చిన్నబీరవల్లి, లక్ష్మీపురం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని కళాజాత నిర్వహించారు. ఈ కళా బృందం పాటలు, నాటికల ద్వారా ప్రజలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

రజక సంఘం మండల అధ్యక్షుడిగా నాగభూషణం

సత్తుపల్లి, ఫిబ్రవరి 11: సత్తుపల్లిలో ఆదివారం జరిగిన రజక సంఘం ఎన్నికల్లో సంఘం మండల అధ్యక్షుడిగా నాగభూషణం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయనను అభినందించారు.

అనుమానాస్పదంగా గుర్తుతెలియని మహిళల సంచారం

పెనుబల్లి, ఫిబ్రవరి 11: పెనుబల్లి బీసీకాలనీలో కొందరు గుర్తుతెలియని ఇద్దరు మహిళలు ఆదివారం అనుమానస్పదంగా సంచరించారు. దీంతో స్థానికులు గమనించి మాజీ సర్పంచ్ తావునాయక్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చి ఆ మహిళల నుంచి వివరాలు సేకరించారు. వారి వద్ద ఉన్న తినుబండారాలను పరిశీలించారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

'మానవ సేవను మాధవసేవగా భావించాలి'

వలస కూలీలకు దుస్తులు అందజేస్తున్న బాధ్యులు

మధిర, ఫిబ్రవరి 11: ప్రతిఒక్కరూ మానవ సేవే మాధవ సేవగా భావించాలని సామాజిక కార్యకర్త లంకా కొండయ్య అన్నారు. మండలంలోని మాటూరుపేట, నిధానపురం గ్రామాల మధ్య ఉంటున్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వలస కూలీలకు రైతులు ముదిగొండ నరేశ్, ధనిశెట్టి రాము, భాస్కర్‌రావు, జానపద కళాకారులు సీలివేరు శాంతయ్య, మాటూరు ఉపాధ్యాయులు మేడేపల్లి నివాసరావు ఆధ్వర్యంలో లంకా కొండయ్య బృంద సభ్యులు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. నంబూరి శ్రీహరి, వంకాయలపాటి నాగేశ్వరరావు, వెంకటరమణ, మేడేపల్లి శ్రీనివాసరావు, చిన్నం శ్రీనివాసరావు, చిన్నం ధరణి, వెలివెల శ్రీధర్ పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థినులకు దుస్తుల అందజేత

సత్తుపల్లి రూరల్, ఫిబ్రవరి 11: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ, కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్ ప్రమీల ఆదివారం దుస్తులు, శానిటరీ నాప్‌కిన్స్ అందజేశారు. కుంజా పావని, నవ్యశ్రీ అనే విద్యార్థినుల ఉన్నత చదువులను తామే చదివిస్తామని అన్నారు. ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, అధ్యాపకులు రజియా సుల్తానా, సత్యనారాయణ, సన, కృష్ణవేణి, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

I, GUDIPOODI SUNITHA (old name), W/o. GUDIPUDI JAGADEESH, R/o. H.No.11-8-159/2, Near Karthik Hospital, Lenin Nagar, Khammam Urban Mandal, Khammam District, Telangana -507001, Hereby changed my as GUDIPUDI SUNITHA (New name). Henceforth, I Shall be called as GUDIPUDI SUNITHA, W/o.GUDIPUDI JAGADEESH For all purposes.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616

'తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి'

మాట్లాడుతున్న ఎంపీపీ మాలోత్ శకుంతల

కారేపల్లి, ఫిబ్రవరి 11: ఈ వేసవిలో మండలంలోని ఏ గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మాలోత్ శకుంతల కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మిషన్‌భగీరథ నీళ్లు అన్ని గ్రామాల్లో నిరంతరాయంగా సరఫరా చేసే విధంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, ఎంపీవో పర్వీన్‌కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పాలకవర్గం చేసిన సేవలు అమోఘం

సర్పంచ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నేతలు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 11: వేపకుంట్ల గ్రామాభివృద్ధికి సర్పంచ్‌గా ధారా శ్యాం చేసిన సేవలు మరువలేనివని మాజీ జడ్పీటీసీ కుర్రా భాస్కర్‌రావు పేర్కొన్నారు. సర్పంచ్‌గా పదవీకాలం ముగిసిన సందర్భంగా ఆదివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, పాలకవర్గ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పెర్ల కొండల్‌రావు, ఉపసర్పంచ్ స్వాతి, గ్రామ కార్యదర్శి సుజాత, అనుబోతు రామస్వామి, ఎస్ఎంసీ చైర్మన్ కూరాకుల నాగేశ్వరరావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు, రవి, రామనాథం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

మధిర, ఫిబ్రవరి 11: నాటి అల్లరి పనులే నేటి మధుర జ్ఞాపకాలుగా మిగులుతాయని జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు. మధిరలోని తేళ్ల వసంతయ్య మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988-89 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. వాసిరెడ్డి రామనాథం, పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, మాధవరపు నాగేశ్వరరావు, బాబ్లా, పూర్వ విద్యార్థులు కర్నాటి రామ్మోహన్‌రావు, అన్నం శ్రీనివాసరావు, సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'పాఠశాల స్థాయిలోనే నైతిక విలువల బోధన'

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకటేశ్వర్లు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11: నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో ఆదివారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోల్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ పరుచూరి వెంకటేశ్వర్లు హాజరై, జ్యోతి ప్రజ్వలనచేసి ప్రసంగించారు. పిల్లలు విద్యతోపాటు నైతిక విలువలను నేర్చుకునేది పాఠశాలలోనేనన్నారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల అధినేత రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, కొలిపార నీలిమ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి'



మాట్లాడుతున్న డీడీ కస్తాల సత్యనారాయణ

వైరా టౌన్, ఫిబ్రవరి 11: హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ సూచించారు. స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. అనంతరం అత్యధిక మార్కులకు సాధించిన విద్యార్థులను సన్మానించారు. మధిర ఏఎస్‌డీవో కొత్తా వెంకటేశ్వరరావు, వసతిగృహ ప్రత్యేక అధికారి తేజావత్ దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులోపడి యువకుడి మృతి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 11: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఇస్లావత్‌తండాలో వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన మాలోతు దస్రూ, సేలా దంపతుల కుమారుడు నరేశ్ (19) రెండు రోజుల క్రితం చేపలు పట్టేందుకు సమీపంలోని చెరువుకు వెళ్లాడు. చేపలు పడుతూ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. గ్రామస్తులు ఆదివారం చెరువులో నరేశ్ మృతదేహాన్ని గుర్తించారు. చేతికి వచ్చి కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు.